

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

గణనను పక్కాగా నిర్వహించండి

» అదనపు కలెక్టర్ శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల సమన్వయంతో చిన్ననీటి వనరుల గణనను సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏడవ చిన్న నీటి వనరుల గణన, రెండవ జలాశయాల గణన అమలుకు సంబంధించి జరిగిన జిల్లాస్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ గణన వ్యవసాయ సంవత్సరం 2023-24 ప్రామాణికంగా చేస్తున్నట్లు తెలిపారు. చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలు, ఫామ్‌పాండ్స్ తోపాటు ఇతర సామాజిక అవసరాలకు వాడే నీటి వనరులను చిన్న నీటి వనరుల కింద లెక్కిస్తారని తెలిపారు. ఈ గణనకు తహసీల్దార్లు మండల ఇన్‌చార్జి ఆఫీసర్లుగా ఉంటారని ఆయన చెప్పారు. జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి సౌమ్య మాట్లాడుతూ సర్వే ప్రక్రియ, డేటా సేకరణ, యాప్ ద్వారా సమాచార నమోదు వంటి అంశాలను వివరించారు. అన్ని విభాగాలు పరస్పర సహకారంతో సమగ్రంగా ఈ లెక్కలను పూర్తి చేయాలని ఆమె చెప్పారు. సమావేశంలో డీఆర్వో సంగీత, జిల్లా వ్యవసాయాధికారి ఉష, డీఆర్డీఏ పీడీ శ్రీలత, డీపీవో సురేష్‌మోహన్, గ్రౌండ్ వాటర్ అధికారి మాధవరావు పాల్గొన్నారు.



చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతాం

» షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

» సాయిరెడ్డి చెరువులో చేప పిల్లల విడుదల

కొత్తూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. కొత్తూర్ మున్సిపాలిటీలోని సాయిరెడ్డి చెరువులో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను వదిలారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం మత్స్యకారులను విస్మరించి, దళారులకు అండగా నిలిచిందని ఆరోపించారు. మత్స్యకారులు, ముదిరాజ్‌లు జీవితాల్లో మార్పులు తెచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తుందన్నారు. ఇందుకోసం ముదిరాజ్ బిడ్డను మంత్రి చేసి మత్స్యశాఖను అప్పగించిందని గుర్తు చేశారు. మత్స్యకారులకు, ముదిరాజ్‌లకు మధ్య తలెత్తిన తగాదాల పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో 200కు పైగా ఉన్న మత్స్యకారుల సొసైటీలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్ణిమ మాట్లాడుతూ జిల్లాలో కోటి చేప పిల్లలు అందజేయాలని లక్ష్యంగా ఉందన్నారు. ప్రస్తుతం 46లక్షల చేప పిల్లలు అందుబాటులో ఉన్నాయని, 30లక్షల చేప పిల్లలను ఆయా చెరువులకు అలాట్ చేసినట్లు పేర్కొన్నారు. త్వరలో లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో 24 చెరువులకుగాను మూడు లక్షల చేప పిల్లలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో డాక్టర్ అరుంధతి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, వైస్‌చైర్మన్ డోలీ రవీందర్, మాజీ ఎంపీపీ ఎం. శివశంకర్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవినాయక్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ, మండల శాఖ అధ్యక్షులు జె. సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు

జిల్లా	ప్రాంతం	(డిగ్రీల్లో)
వికారాబాద్	మర్పల్లి	12.6
రంగారెడ్డి	మంగల్‌పల్లి	13.1
మేడ్చల్	ఘట్‌కేసర్	13.9





» ఉమ్మడి జిల్లాలో 'లక్కీ' భాస్కర్లకు కాసుల వర్షం (గుడ్ విల్)

» ఒక్కో దుకాణానికి రూ.50 లక్షల నుంచి రూ.2.50కోట్ల వరకు ఆఫర్

» డ్రాలో మద్యం దుకాణాలు పొందిన వారికి సిండికేట్ వ్యాపారుల ఎర

» నగర శివార్లలో భారీ డిమాండ్

» సరూర్‌నగర్ ప్రాంతంలో రూ.2.60 కోట్ల గుడ్‌విల్ ఇచ్చిన అధికార పార్టీ నేత

రాయబేరాలు!

కాసుల వర్షం కురిపించే మద్యం దుకాణాలకు ఉమ్మడి జిల్లాలో భారీ డిమాండ్ పెరిగింది. రెండేళ్లకోసారి దరఖాస్తులు స్వీకరించి లక్కీడ్రా ద్వారా కేటాయించే ఈ షాపులను దక్కించుకోవడానికి వ్యాపారులు పోటీ పడుతుంటారు. ఇటీవల నిర్వహించిన డ్రాలో పలువురు వ్యాపారులను అదృష్టం వరించగా.. మరికొందరికి నిరాశే మిగిలింది. అయితే మద్యం దుకాణాలు దక్కనివారు లక్కీ భాస్కర్లకు ఎర వేస్తున్నారు. కోట్ల రూపాయల గుడ్‌విల్‌ను ఆఫర్ చేస్తూ మద్యం షాపులను దక్కించుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే చాలా దుకాణాలు ఇలానే చేతులు మారాయి. సిండికేట్లు మరిన్ని షాపులను దక్కించుకునేందుకు ముమ్మరంగా బేరసారాలు కొనసాగిస్తున్నారు.

చేతులు మారుతున్న మద్యం షాప్‌లు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : లాటరీ ద్వారా కేటాయించిన మద్యం దుకాణాలు పెద్ద సంఖ్యలో చేతులు మారుతున్నాయి. కొత్త ఎక్సైజ్ సంవత్సరానికి సంబంధించి ఇంకా మద్యం వ్యాపారం ప్రారంభించక ముందే డ్రాలో మద్యం దుకాణాలు దక్కించుకున్న లక్కీ భాస్కర్‌లకు కాసుల వర్షం కురుస్తోంది. డ్రాలో మద్యం దుకాణాలు దక్కని సిండికేట్లు 'లక్కీ'ల నుంచి మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు బేరసారాలు కొనసాగిస్తున్నారు. ఈ అదృష్టవంతుల ఇళ్లకు సిండికేట్లు వచ్చి వారి గుమ్మాల ముందు రూ. కోట్లు కుమ్మరిస్తున్నారు. నగర శివార్లలో సిండికేట్లు భారీగా ఆఫర్లు ఇస్తున్నారు. ఇప్పటికే ఆదాయం వచ్చే కొన్ని కీలక ప్రాంతాల్లో సిండికేట్లు షాపులను అధిక ధరలు చెల్లించి కైవసం చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో రూ.50 లక్షల నుంచి రూ.2.50కోట్లకు పైగా గుడ్‌విల్ ఆఫర్ ఇస్తున్నారు. సరూర్‌నగర్ డివిజన్‌లో కొన్నాళ్లుగా మద్యం వ్యాపారం నడుపుతున్న అధికార పార్టీ నేత ఒకరు తనకు డ్రాలో మద్యం షాపు రాలేదు. దీంతో ఆయన డ్రాలో షాపు వచ్చిన వారికి రూ.2.60 కోట్లు గుడ్‌విల్ ఇచ్చి దాన్ని సొంతం చేసుకున్నారు. అలాగే ఇదే ప్రాంతానికి చెందిన మరో వ్యాపారి



మిగతా 7వ పేజీలో...



చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభం

8

నేలవాలిన ఆశలు

వరికోతకు అడ్డంకులు

- తడారని పొలాలు
- యంత్రాలు దిగలేని పరిస్థితి
- కోత పనులకు రాని కూలీలు
- ఆందోళనలో రైతన్నలు



ఇబ్రహీంపట్నం మండలం ఎల్గల్‌గూడలో నేలకొరిగిన వరి పంట

ఇబ్రహీంపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటలపై ఆశలు పెట్టుకున్న రైతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఇటీవల ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో చేతికొచ్చిన వరి పంట పొలాల్లో నీరు నిలిచింది. కనీసం వరికోత యంత్రాలు పొలాల్లోకి దిగే పరిస్థితి కూడా లేదు. అదీగాక అక్కడక్కడా ఏపుగా పెరిగిన వరి నేల వాలింది. దీంతో పంటను కోసే పరిస్థితి లేక అన్నదాతలు దిగులుపడుతున్నారు. కూలీలతో కోద్దామంటే ఎవరూ రావట్లేదు. కొన్నిచోట్ల పొలాలు జాలు వారాయి. వర్షాలు తగ్గినా పైనుంచి వస్తున్న జాలు కారణంగా పొలాలు తడిగానే ఉంటున్నాయి. ఇక చెరువులు, కుంటల కింద ఉన్న పొలాల్లో వరి కోసే పరిస్థితి లేదు. చేనుల్లో తడారెదెప్పుడు..? పొంట కోసేదెప్పుడు అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో ఈ సారి వానాకాలంలో 1.59 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. వర్షాలు తగ్గడంతో వారం రోజులుగా వరి కోత పనులు

మిగతా 8వ పేజీలో...



యాచారం మండలం నందివనపర్తిలో నీరుండడంతో ఆరబెట్టిన వరి చేను

పెట్టుబడి చేతికొచ్చేలా లేదు



రెండున్నరెకరాల్లో వరి సాగు చేశా. పంట బాగానే ఉంది. దిగుబడులు అధికంగా వస్తాయనుకుంటే వర్షాలకు కోతకొచ్చిన పంట నేలకొరిగింది. అయినా ఎంతో కొంత పంట రాకపోతుందా అనుకుంటే పొలాల్లో నీరు తగ్గడం లేదు. ఇప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. పొలంలో నీరు తగ్గితే తప్ప వరి కోత మిషన్ దిగే పరిస్థితి లేదు.

- చిన్నగంట లచ్చిరెడ్డి, రైతు ఎన్గల్‌గూడ, ఇబ్రహీంపట్నం మండలం

ఫ్లెక్సీలు తొలగించడం

దుర్మార్గం

తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి



కందుకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తప్పా అని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి తెలిపారు. బుధవారం కందుకూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నల్గొండ జిల్లాలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హోర్డింగులు, ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు రాత్రికి రాత్రి తొలగించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం పోస్టర్ల తొలగింపు మాత్రమే కాదని, ప్రజాభిప్రాయాన్ని అణిచివేయాలనే రాజకీయ దుర్మార్గమని మండిపడ్డారు. జాగృతి జనంబాట కార్యక్రమం ద్వారా చైతన్యం కలిగించే ప్రయత్నంలో హోర్డింగులు ఏర్పాటు చేయడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఈ దుశ్చర్య వెనుక మంత్రి కోమటిరెడ్డి హస్తం ఉందని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది న్యాయ సూత్రాలను తుంగలో తొక్కిన చర్య అని ఆయన అభివర్ణించారు. ప్రభుత్వ నిధులతో అధికార పార్టీ నేతల పోస్టర్లు ఎక్కడపడితే అక్కడ పెట్టొచ్చు కానీ, ప్రజా కార్యక్రమానికి సంబంధించినవి పెడితే మాత్రం భరించలేకపోవడం దారుణమన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించొద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

రూ.500బోనస్ ఇస్తున్నాం

డీసీసీబీ చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య

యాచారం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చివరి గింజ వరకు వరి ధాన్యం కొంటామని, సన్న ఒడ్లు క్వింటాకు బోనస్ రూ.500 చెల్లిస్తున్నామని డీసీసీబీ చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య తెలిపారు. బుధవారం యాచారం, నందివనపర్తి, చింతపట్ల గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని సూచించారు. రైతుల వద్ద తక్కువ ధరకు కొని మిల్లర్లకు ఎక్కువకు అమ్మి లాభాలు గడిస్తున్నారనే విషయాన్ని మరవొద్దన్నారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు రూ.2389, బీ గ్రేడ్ రూ.2369కు కొంటున్నామన్నారు. ధాన్యం నాణ్యతగా ఉండేలా చూసుకోవాలన్నారు. మట్టిపెడ్డలు, తాలు లేకుండా 17శాతం తేమ ఉండేలా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. రైతులను ఆదుకునేందుకు మొండిగౌరెల్లి, గడ్డమల్లాయాగూడ, చౌదర్‌పల్లి గ్రామాలలో కూరగాయల రైతులకు డ్రిప్, ఇతర పరికరాలను రాయితీపై ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధారాణి, మండల వ్యవసాయాధికారి రవినాథ్, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కె.గురునాథ్‌రెడ్డి, బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎం.నర్సింహ్మా, నాయకులు కె.జోగురెడ్డి, ఐకేపీ ఏపీఎం రవీందర్, సీసీలు గణేష్, జయలక్ష్మి, స్వరూప, లలిత, జ్యోతి, ఉమా, లావణ్య, రమేష్ తదితరులున్నారు.

నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ప్రతీ నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకుంటామని డీసీసీబీ చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య పేర్కొన్నారు. బుధవారం నందివనపర్తి గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. పదిమంది నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని స్థానికులు ఆయనను కోరారు. తక్షణమే ఆ పదిమంది కుటుంబాలకు ఇందిరమ్మ ఇంటి కేటాయింపు సర్టిఫికెట్లను అందించారు.

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా పెంటయ్య



కడ్తాల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షునిగా జల్లెల్ల పెంటయ్య ఎన్నికయ్యారు. హైదరాబాద్ కాటేదాన్‌లో జరిగిన సీఐటీయూ జిల్లా 4వ మహాసభల ముగింపు సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకుల సమక్షంలో వేసిన నూతన కమిటీలో తలకొండపల్లి మండలం పడకల్‌కు చెందిన పెంటయ్యకు ఉపాధ్యక్షునిగా అవకాశం లభించింది. తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

భూమాతను పరిరక్షించుకోవాలి

ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

కడ్తాల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): భూమాతను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని రాష్ట్ర సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్ జి. చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి ది ఎర్త్ సెంటర్‌లో బుధవారం కౌన్సిలర్ ఫర్ గ్రీన్‌రెవల్యూషన్, రాష్ట్ర విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో వాతావరణ మార్పులు, పాఠశాలల బాధ్యత, యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీజీఆర్ అధ్యక్షురాలు కోర్పోలు లీలాలక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రెండు రోజుల సదస్సుకు చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలకు చెందిన 200మంది సైన్స్ ఉపాధ్యాయులు



సదస్సును ప్రారంభిస్తున్న ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎర్త్ సెంటర్ పర్యావరణ శిక్షణ కేంద్రంలో నూతనంగా నిర్మించిన బ్యాంబ్ హాల్‌ను చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. వీటిపైనే భావితరాల మనుగడ ఆధారపడి ఉందన్నారు. వాతావరణ మార్పులపై అవగాహన పెంచేందుకు సైన్స్ ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. సీజీఆర్ అధ్యక్షురాలు లీలాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు సీజీఆర్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రముఖ పర్యావరణ వేత్త, ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ అంశాలపై సైన్స్ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సీనియర్ సామాజిక శాస్త్రవేత్త జి. ప్రసన్నకుమార్, ప్రొఫెసర్, విద్యావేత్త ఉపేందర్, వందేమాతరం ఫౌండేషన్ అధ్యక్షుడు రవీందర్ రావు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ వ్యవస్థాపకులు కోర్పోలు లక్ష్మారెడ్డి, సీజీఆర్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ యానాల వెంకట్‌రెడ్డి, యంగ్ ఎర్త్ లీడర్స్ కో-ఆర్డినేటర్ రజనీకాంత్, ప్రోగ్రామ్ ఆఫీసర్ నగేశ్, సీజీఆర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కపాస్‌కిసాన్‌పై అవగాహన

మండల వ్యవసాయాధికారి రవినాథ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం. నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో పత్తిని దళారులు కొనుగోలు చేస్తున్న విషయమై బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'పత్తి రైతుకు చిక్కు' కథనానికి మండల వ్యవసాయాధికారి రవినాథ్ స్పందించారు. తాము ఏఈవోలతో కలిసి గ్రామాలలో పత్తి రైతులను కలిసి కపాస్‌కిసాన్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. రైతులు పత్తి తేమ శాతం 8 నుంచి 10 వరకుంటే ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించనున్నట్లు చెప్పారు. పత్తిని దళారులకు విక్రయించి నష్టపోకుండ చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీరోజు రైతులకు ఫోన్‌చేసి రైతువేదిక వద్దకు రప్పించి స్లాట్ బుక్‌చేసి పత్తిని విక్రయించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పీఎంశ్రీ నిధుల వివరాలు వెల్లడించాలి

మహేశ్వరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు పరుస్తున్న ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) నిధుల వివరాలను వివరించాలని రంగారెడ్డి జిల్లా దిశ కమిటీ సభ్యుడు అంబోజి శ్రీనివాస్ అన్నారు. ఈమేరకు బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు విద్యాధికారి పూర్ణచంద్రరావును కలిసి నిధుల వివరాలు ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. ఏయే పనులకు నిధులు వినియోగిస్తున్నారన్న వివరాలు వెల్లడించాలన్నారు.

అవినీతి అధికారులను ప్రభుత్వం ఉపేక్షించదు

పనుల కోసం లబ్ధిదారులు లంచాలివ్వొద్దు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడే అధికారులు, ఉద్యోగులను ప్రభుత్వం ఉపేక్షించబోదని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హెచ్చరించారు. పనులు త్వరగా కావాలని లబ్ధిదారులు అధికారులు, సిబ్బందికి లంచాలు ఇచ్చి వారిని అవినీతిపరులుగా మార్చొద్దన్నారు. ఆమనగల్లు పట్టణంలోని కల్యాణిగార్డెన్‌లో బుధవారం 76 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, కొత్తగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన 48 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా నర్సింహ, వైస్‌చైర్మన్


కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతిశ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి కసిరెడ్డి పంపిణీ చేశారు. అనంతరం తహసీల్దార్ మహ్మద్ ఫయామ్ ఖాద్రీ, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, ఎంపీడీవో మాధురిలతో కలిసి నిర్మాణాలు పూర్తైన పలువురు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ . పనిచేయని, అక్రమాలకు పాల్పడే అధికారులు, సిబ్బంది ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని అన్నారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ షాలినీ, మున్సిపల్ మేనేజర్ అంజనేయులు, యాట నర్సింహ, జగన్, మానయ్య, మిట్టపల్లి అంజయ్య, కానుగుల దశరథం, ఖాదర్‌ఖాద్రి, తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లు : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

రాయ'బేరాలు'!

(ఐదో పేజీ తరువాయి)

కూడా రూ. 2.20 కోట్లు వెచ్చించి షాపు తీసుకున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున మద్యం షాపులు వ్యాపారం ప్రారంభానికి ముందు చేతులు మారుతున్నాయి. ఈసారి మద్యం దుకాణాల కోసం ఒకటి, రెండు దరఖాస్తులు దాఖలు చేసిన వారికి ఎక్కువగా లక్కీ డ్రాలో అదృష్టం వరించింది. పదుల నుంచి వందల సంఖ్యలో దరఖాస్తు చేసిన వారి కంటే ... వస్తే మద్యం దుకాణం, పోతే రూ. 3 లక్షలు అనుకుని దరఖాస్తు చేసుకున్న వారినే ఈసారి ఎక్కువగా లక్కీ డ్రాలో అదృష్టం వరించింది. మద్యం వ్యాపారంతో సంబంధం లేకుండా కొత్తగా దరఖాస్తు చేసుకుని అదృష్టం కలిసి వచ్చిన వారికి గుడ్‌విల్ ఎరచూపి వారికి డ్రాలో వచ్చిన మద్యం దుకాణాలను సొంతం చేసుకునేందుకు సిండికేట్, మద్యం వ్యాపారులు తమ ప్రయత్నాలను తీవ్రతరం చేశారు. చాలా కాలంగా మద్యం వ్యాపారంలో కొనసాగుతున్న కొందరు సిండికేట్‌గా మారి... డ్రాలో మద్యం దుకాణాలు వచ్చిన వారికి గుడ్‌విల్ ఆఫర్ చేస్తున్నారు. మద్యం వ్యాపారుల సిండికేట్ల గుడ్‌విల్‌కు కొందరు మొగ్గు చూపితే.. మరికొందరు తామే మద్యం దుకాణాలను నడిపించుకుంటామని స్పష్టం చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇలాంటి వారి నుంచి కూడా మద్యం దుకాణాలను సొంతం చేసుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం కొనసాగుతున్న మద్యం దుకాణాల కాల పరిమితి ఈనెల 30వ తేదీతో ముగియనుంది. 2025-27 సంవత్సరాలకు సంబంధించి మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో డ్రాలో ఎంపికైన వారికి డిసెంబరు ఒకటో తేదీ నుంచి మద్యం దుకాణాలు నిర్వహించేందుకు అనుమతులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకుని డ్రాలో భంగపడ్డ వ్యాపారులు మద్యం దుకాణాలను చేజిక్కించుకునేందుకు సిండికేట్ల రూపంలో తీవ్ర



ప్రయత్నాలు చేస్తున్నారు.

దరఖాస్తులకు ముందే సిండికేట్

ఉమ్మడి జిల్లాలో 514 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇందులో రంగారెడ్డిజిల్లాలో 249, మేడ్చల్ జిల్లాలో 206, వికారాబాద్‌లో 59 మద్యం షాపులు ఉన్నాయి. వీటికి 28వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. అయితే ముందుగానే మద్యం వ్యాపారులు సిండికేట్ కావడంతో ఈ సారి గతంలో కంటే 10వేల దరఖాస్తులు తక్కువ వచ్చాయి. దీనివల్ల కూడా ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లింది. గతనెల 27న నిర్వహించిన మద్యం దుకాణాల కేటాయింపు డ్రాలో సిండికేట్లలో కొందరికే అదృష్టం కలిసి వచ్చింది. ప్రస్తుతం మద్యం వ్యాపారంలో కొనసాగుతున్న వారితో పాటు కొత్త వారు కూడా ఎక్కువ సంఖ్యలో ఈసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. అయితే మద్యం వ్యాపారంలోకి కొత్తగా అడుగు పెట్టిన పలువురికి డ్రాలో అదృష్టం కలిసి వచ్చింది. ఒక దరఖాస్తు మాత్రమే దాఖలు చేసిన వికారాబాద్ జిల్లాలో ఆరుగురు మద్యం దుకాణాలు దక్కించుకున్నారు. రెండు నుంచి అయిదు లోపు దరఖాస్తు చేసుకున్న వారిలో ఏడుగురిని అదృష్టం వరించింది. జిల్లాలో మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్న ఇతర జిల్లాలకు చెందిన పది మంది డ్రాలో ఎంపిక కాగా, జిల్లాలో ఒకరికే వేర్వేరు చోట్ల రెండు మద్యం దుకాణాలు దక్కిన ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. గతంలో మాదిరిగా ఈసారి సిండికేట్లకు ఎక్కువ దుకాణాలు దక్కలేదు. సిండికేట్‌గా ఏర్పాటై ఎక్కువ సంఖ్యలో దరఖాస్తు చేసినా డ్రాలో భంగపాటే ఎదురైంది. మద్యం వ్యాపారాన్ని ఓ స్టేటస్‌గా భావిస్తున్న వారు ఇందులో కొత్తగా దిగి దుకాణాలు దక్కించుకున్న వారికి గుడ్‌విల్ రూపంలో ఆశ చూపి వైన్ షాపులను దక్కించుకునేందుకు తీవ్రంగా ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు తెలుస్తోంది. రోజూ కాసులు కురిపించే వ్యాపారం కావడంతో ఎలాగైనా మద్యం దుకాణాలు దక్కించుకునే పనిలో నిమగ్నమయ్యారు.

రూ.50 లక్షల నుంచి రూ.2.50 కోట్ల వరకు ...

ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే పలు మద్యం దుకాణాలు చేతులు మారాయి. ఒక్కో మద్యం దుకాణం డిమాండ్ మేరకు రూ.50 లక్షల నుంచి రూ.2.50 కోట్లకుపైగా ధర పలుకుతున్నాయి. నగర శివార్లలో రూ. 2కోట్లకుపైగా ధర పలుకుతున్న షాపుల సంఖ్య 100 వరకు ఉంటుందని అంచనా. జాతీయ, రాష్ట్ర రహదారులు, ముఖ్య కూడళ్లలో ఉండే మద్యం దుకాణాలకు రూ. కోటి నుంచి రూ.2కోట్ల వరకు గుడ్‌విల్ రూపంలో చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే మద్యం దుకాణాలకు రూ.50 లక్షల నుంచి రూ. కోటి వరకు గుడ్ విల్ పలుకుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మద్యం దుకాణం కేటాయించిన ప్రాంతం, ప్రస్తుతం జరుగుతున్న వ్యాపారం ఆధారంగా గుడ్‌విల్ ఆఫర్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. రూ.3 లక్షల పెట్టుబడితో నెల రోజుల్లోనే కోటీశ్వరులయ్యే అవకాశం దక్కడంతో పలువురు తమకు డ్రాలో దక్కిన మద్యం దుకాణాలను సిండికేట్ వ్యాపారులకు అప్పగించి గుడ్‌విల్ తీసుకునేందుకు బేరసారాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కులకచర్ల మండల పరిధిలో డ్రాలో మద్యం దుకాణం దక్కించుకున్న ఓ వ్యక్తి రూ1.43 కోట్లకు ఇతరులకు విక్రయించడం చర్చనీయాంశంగా మారింది. డ్రాలో ఇది వరకే ఓ మద్యం దుకాణం దక్కించుకున్న వారే మరొక దుకాణాన్ని గుడ్‌విల్ ఇచ్చి దక్కించుకున్నట్లు తీసుకున్నట్లు సమాచారం.

నేడు ధారూరులో స్పీకర్ పర్యటన

ధారూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13న(గురువారం) శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్ తెలిపారు. తరిగోపులలో పిల్లల పార్క్, వాటర్‌ప్లాంట్, మురికాలువ, సిమెంట్ రోడ్డు ప్రారంభోత్సవం, రాజాపూర్‌లో బీటీ రోడ్డు, గడ్డమీది గంగారంలో బీటీ రోడ్డు, అవుసుపల్లిలో ఇందిరమ్మ ఇళ్లు, అంగన్‌వాడీ భవనం, అల్లీపూర్‌లో బీటీ రోడ్డు, గట్టేపల్లిలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనం ప్రారంభోత్సవం, ధారూరులో అంగన్‌వాడీ, మార్కెట్ యార్డులో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని ఆయన చెప్పారు. అనంతరం సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ, మహిళా సమాఖ్య అధ్వర్యంలో పెరటి కోళ్ల పంపిణీ కార్యక్రమంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు.

పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి

దోమ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను అందించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు అన్నారు. మండలంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగులకు మూడు, నాలుగు సంవత్సరాలుగా బెనిఫిట్స్ లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం అందించాలని కోరారు. సభ్యత్వ నమోదులో మండల అధ్యక్షుడు వాసురాం, ప్రధనఅ కార్యదర్శి జంగయ్య, జిల్లా నాయకులు రమేశ్, మేఘ్యా పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలపై విజిలెన్స్ తనిఖీలు

తాండూర్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాండూర్ మండలంలోని ఓగిపూర్ గ్రామానికి చెందిన ఎన్.గోవిందప్పకు సర్వే నంబర్ 141లో ఎకరా పట్టా భూమి ఉంది. అదే సర్వే నంబరులో బీజేపీ మాజీ ఎంపీ బద్దం బాల్‌రెడ్డికి చెందిన భూమిని తాండూర్‌కు చెందిన శెట్టి రమేశ్‌కు విక్రయించాడు. ఆయన నుంచి తాండూర్‌కు చెందిన గఫూర్‌పాష అనే వ్యక్తి భూమిని కొనుగోలు చేసి ఎలాంటి అనుమతులు లేకుండా అక్కడ తవ్వకాలు చేపడుతున్నాడు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చకుండా అక్రమంగా విద్యుత్ కనెక్షన్‌తో ఆ భూమిలో దౌర్జన్యంగా గఫూర్‌పాష తవ్వకాలు చేపడుతూ, పక్కనే ఉన్న తన ఎకరా భూమిలో దౌర్జన్యంగా తవ్వకాలు చేస్తున్నాడని రైతు గోవిందప్ప తాండూర్ రెవెన్యూ, మైన్స్ శాఖ అధికారులతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో ఆయన లోకాయుక్తను ఆశ్రయించాడు. గోవిందప్ప ఆరోగ్యం బాగాలేక ఇబ్బందుల్లో ఉన్నా ఈ నెల 7న విచారణకు హాజరయ్యారు. న్యాయమూర్తి ముందు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ గఫూర్ పాష అనే వ్యక్తి తన సొంత భూమిలో తవ్వకాలు చేపట్టాడని, అడ్డుపడితే తన అనుచరులతో బెదిరింపులకు గురి చేయడంతో లోకాయుక్తను ఆశ్రయించినట్లు తెలిపాడు. స్పందించిన న్యాయమూర్తి మైన్స్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులకు విచారణతో నివేదిక అందించాలని ఆదేశించారు. దీంతో అధికారులు ఓగిపూర్‌లోని రైతు గోవిందప్పకు చెందిన సర్వే నంబర్ 141 పట్టా భూమితోపాటు పక్కనే ఉన్న భూమిని పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు జరిపినట్లు గుర్తించారు. పూర్తి నివేదికను లోకాయుక్త న్యాయమూర్తికి అందించనున్నట్టు వారు తెలిపారు.


తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

విద్యార్థుల సౌకర్యార్థం అదనపు గదుల నిర్మాణం

మాడ్గుల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం అదనపు గదులను నిర్మిస్తుందని విద్యా మౌలిక వసతుల మేనేజింగ్ డైరెక్టర్ గణపతిరెడ్డి అన్నారు. మాడ్గులలోని ఉన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాలలో అదనపు గదుల నిర్మాణ పనులను బుధవారం చీఫ్ ఇంజనీర్ సఫిమియా, ఈఈ రామ్‌కుమార్, డీఈ కల్మానుద్దీన్‌లతో కలిసి సమీక్షించారు. ఉన్నత పాఠశాలలో రూ.3 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టామని, కిచెన్ షెడ్, స్కూల్ ఆర్చి, కాంపౌండ్‌వాల్ మొదలగు అభివృద్ధి పనులను చేపట్టామని తెలిపారు. పనులు సక్రమంగా, వేగంగా చేయాలని ఏఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. అలాగే మాడ్గుల ప్రాథమిక పాఠశాలలో మూగ,చెవిటి విద్యార్థుల కొరకు అదనపు గది నిర్మాణం చేపట్టాలని ఎంఈవో సర్దార్ నాయక్ కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సుదర్శన్, టీచర్లు, సాయిరెడ్డి, నర్సింహారెడ్డి, మసున విష్ణుపాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న గణపతిరెడ్డి

రెచ్చిపోయిన 'రియల్' వ్యాపారులు

ఏకంగా బస్టాండ్ కూల్చివేత.. ఎన్ఎఫ్‌సీనగర్‌లో ఘటన

చర్యలు తీసుకోవాలని కాలనీవాసుల డిమాండ్

ఘట్‌కేసర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారులు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనం. కాలనీలోని పురాతన బస్టాండ్‌పై కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడింది. బుధవారం ఏకంగా బస్టాండ్‌ను కూల్చేసి చదును చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. 151 ఎకరాల సువిశాలమైన ఎన్ఎఫ్‌సీనగర్ కాలనీలో జనావసరాలకు అనుగుణంగా అప్పట్లో 80 అడుగుల రోడ్డులో అక్కడక్కడా బస్టాండ్‌లను నిర్మించారు. వర్షం కురిస్తే ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చాలాచోట్ల రేకులతో షెడ్లు నిర్మించారు. కొన్ని చోట్ల సిమెంట్ కట్టడాలతో వదిలేశారు. అయితే కాలనీలోని బస్టాప్ వెనుక ఉన్న ప్లాటును చదునుచేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాటుకు ఎదురుగా బస్టాండ్ ఎందుకు అనుకున్నారో ఏమో ఎక్స్‌కావేటర్‌తో నేలమట్టం చేశారు. అందులో ఉండే గ్రానైట్ రాళ్లను సైతం మాయం చేయడం గమనార్హం. ఇది గమనించిన స్థానికులు ఇదేంటని నిలదీశారు. 30సంవత్సరాల నుంచి ఉన్న బస్టాప్‌ను ఎలా కూల్చివేస్తారని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. విషయాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకుపోయినట్లు కాలనీవాసులు తెలిపారు. కూల్చివేసిన బస్టాప్‌ను తిరిగి నిర్మించకపోతే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


ఎన్ఎఫ్‌సీనగర్‌లో కూల్చివేసిన బస్టాప్


మహిపాల్‌రెడ్డి స్మృతి వనంలో నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

మహిపాల్‌రెడ్డికి మాజీ మంత్రి నివాళి

తాండూరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ మంత్రి సబితారెడ్డి తండ్రి, జి.మహిపాల్‌రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా తాండూరు మండలం కోటబాస్పల్లిలోని స్మృతి వనంలో బుధవారం ఆమె సోదరుడు నర్సింహారెడ్డి(బాబు), సోదరి సద్గుణరెడ్డితో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మహిపాల్ రెడ్డి తాండూరు మండలానికి అందించిన సేవలు మరువలేనివని గుర్తు చేశారు. అనంతరం స్మృతి వనం వద్ద గ్రామానికి చెందిన కొంత మందికి పండ్లను పంపిణీ చేశారు. సమీపంలోని ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సోదరుడు గోటుగ రాజేందర్‌రెడ్డి, పీఏ ట్టీయూ జిల్లా నాయకులు నాగప్ప, కిష్టప్ప, స్నేహితులు వెంకట్‌రాం రెడ్డి, వీపీ రెడ్డి, బీసీ సంఘం నాయకులు సయ్యద్ సుకూర్, కరన్‌కోట్ జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. అపర్ణ

- కుటుంబసభ్యుల మృతితో దయనీయ పరిస్థితి
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

కులకచర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కులకచర్లలో 12రోజుల క్రితం అనుమానంతో భార్య, ఆమె అక్కను, చిన్న కూతురును దారుణంగా హత్య చేసి అతను కూడా ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో గాయాలతో బయటపడిన పెద్ద కూతురు అపర్ణ పరిస్థితి దయనీయంగా మారింది. ప్రస్తుతం ఆమె పాలమూర్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. కుడి చేయికి గాయాలు కావడంతో వైద్యులు ఆమెకు శస్త్ర చికిత్స చేశారు. అదేవిధంగా గొంతునొప్పితో బాధపడుతోంది. ప్రస్తుతం అమ్మమ్మ పడిగ్యాల సాయమ్మ ఆమెకు ఆస్పత్రిలో తోడుగా ఉంది. తల్లిదండ్రులు, చెల్లి, ఆదరించే పెద్దమ్మ అందరూ మృతిచెందడంతో దిక్కుతోచని స్థితిలో ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తోంది.


పాలమూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అపర్ణ

ఎంపీడీవో సృజన సాహిత్యకు సన్మానం

మోమిన్‌పేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల నూతన ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన సృజన సాహిత్యను బుధవారం ఏపీవో శంకరయ్య, ఉపాధిహామీ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సోమారపు శ్రీనివాస్, అడివి రెడ్డి, పోచయ్య, హనుమంతు, చంద్రశేఖర్, నాగేందర్, జగన్నాథం, బుచ్చయ్య, దేవిదాస్, అశోక్, చందర్, లక్ష్మణ్, మల్లేశం, నర్సిములు, యంపీవో యాదగిరి, భగవాన్, ఎల్లయ్య, గంగయ్య, వెంకటేశ్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

మాదాసి కురుమలకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వండి


నిరసన తెలుపుతున్న మాదాసి కురుమలు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాదాసి కురుమలకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలని తెలంగాణ మాదాసి కురుమ ఎస్సీ సంక్షేమ సంఘం షాద్‌నగర్ అధ్యక్షుడు సిందం విఠల్ డిమాండ్ చేశారు. మాదాసి కురుమ ఎస్సీ సంక్షేమ సంఘం పిలుపు మేరకు బుధవారం షాద్‌నగర్ ఆర్డీవో ఆఫీసు ఎదుట నిరసన వ్యక్తం చేసి, అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. మాదాసి, మాదారి కురువ కులం ఎస్సీ జాబితా ఉందని, వారందరికీ ప్రభుత్వం ఎస్సీ సర్టిఫికెట్లను ఇచ్చి, విద్య, ఉద్యోగ, ఉద్యోగ అవకాశాలలో ప్రాధాన్యతనివ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పలు జిల్లాలోని మాదాసి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇచ్చారని అన్నారు. నాయకులు బండ వెంకటేష్, కుమార్, మోటే శ్రీనివాసులు, శంకరయ్య, బి.బాల్‌రాజు, సిందం నర్సింహులు, మల్లేష్, రమేష్, మహేందర్, యాదగిరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శంకరన్నా.. సొంతింటి కల నెరవేరింది

- భావోద్వేగానికి గురై కంటతడి పెట్టిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు కూతురు
- గృహప్రవేశం చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


షాద్‌నగర్: ఎమ్మెల్యే శంకర్‌తో శిరీష భావోద్వేగం

షాద్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల తర్వాత సొంతింటి కల నేరవేరడంతో ఓ గిరిజన యువతి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎదుట ఆనందంతో కన్నీరు పెట్టుకుంది. ఏళ్ల తరబడి చిన్న పూరిగుడిసెలో నివాసముంటున్నామని, సొంతింటి కోసం తమ తల్లిదండ్రులు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకుండా పోయిందని, మీరు ఎమ్మెల్యే అయిన రెండేండ్లలోనే తమ సొంతింటి కల నెరవేర్చారంటూ ఓ గిరిజన యువతి ఎమ్మెల్యే శంకర్ ఎదుట భావోద్వేగంతో కన్నీరుపెట్టిన ఘటన పులిచెర్లకుంట తండాలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని పులిచర్లకుంట తండా శివారులోని కర్ణంకుంట తండాకు చెందిన నిరుపేద గిరిజన దంపతులు కవిత-మోహన్‌నాయక్ పూరి గుడిసెలో ఉంటూ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. రోజూ వారి సంపాదన కుటుంబ పోషణకు కూడా సరిపోవడం లేదు. కానీ, ఎలాగైన సొంతిళ్లు కట్టుకోవాలన్నదే వారి కల.. కానీ చేతిలో చిల్లిగవ్వ కూడా ఉండటం లేదు. ఈక్రమంలో బ్యాంకుల నుంచి రుణం కూడా పొందలేదు. ప్రభుత్వపరంగా ఇల్లు కట్టించాలంటూ ఏళ్ల తరబడి ప్రజాప్రతినిధులు, గిరిజన సంక్షేమ అధికారుల చుట్టూ తిరిగారు. అయినా ఫలితం లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తార్వత ఇందిరమ్మ ఇంటి కోసం వారు దరఖాస్తు చేసుకోగ ప్రభుత్వం ఇంటిని మంజూరు చేసింది. వారికి ఉన్న కొంత స్థలంలో ఇంటిని నిర్మించుకుని బుధవారం గృహప్రవేశం పెట్టుకున్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఆహ్వానించారు. ఈమేరకు ఇంటి దంపతుల కూతురు శిరీష ఎమ్మెల్యేను చూడగానే భావోద్వేగానికి గురై ఆయన భుజాలమీద పడి శంకరన్నా.. మీ వల్లనే మా సొంతింటి కల నేరవేరిందంటూ భావోద్వేగానికి గురై కంట తడిపెట్టడంతో అక్కడ ఉన్నవారు కూడా కంట తడిపెట్టడం గమనార్హం. కాగా, ఎమ్మెల్యే కవిత-మోహన్ దంపతులకు కొత్త బట్టలు పెట్టి వారితో కలిసి భోజనం చేశారు. గిరిజన మహిళలతో కలిసి శంకర్ ఉత్సాహంగా నృత్యం చేశారు. అర్హులందరికీ ఇళ్లు ఇస్తామన్నారు.

క్రైం కార్నర్

తండ్రి మందలించాడని ఉరేసుకొని బాలిక ఆత్మహత్య

యాచారం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మాట్లాడుతూనే ఉంటావా? చదువుకోవా? అని తండ్రి మందలించడంతో మనస్తాపం చెందిన 14 ఏళ్ల బాలిక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీ‌స్‌స్టేషన్ పరిధిలోని సాయిరెడ్డిగూడలో చోటుచేసుకుంది. సాయిరెడ్డిగూడకు చెందిన సాయిలు, లావణ్య దంపతుల కుమార్తె శిరీష(14) నగరంలోని ఓ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఈక్రమంలో రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చింది. మంగళవారం ఉదయం బాలిక సెల్‌ఫోన్ చూస్తుండగా.. ఎప్పుడూ సెల్ చూడటమేనా? చదువుకోరాదా అని తండ్రి మందలించాడు. ఇది మనస్సులో పెట్టుకున్న బాలిక మనస్తాపంతో బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌ను చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మృతి

- ట్రాక్టర్-ఆటో ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలు

తలకొండపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్-ఆటో ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఆటోడ్రైవర్ కాలూరి వీరేశ్ (37) మృతిచెందాడు. తలకొండపల్లి మండలం వెంకట్రావ్‌పేట గేటు చౌరస్తాలో ఆమనగల్లుకు వెళ్తున్న ట్రాక్టర్, వెంకట్రావ్‌పేటకు వస్తున్న ఆటో మంగళవారం రాత్రి ఎదురెదురుగా ఢీకొన్నాయి. దాంతో ట్రాక్టర్ డ్రైవర్ పోలె రాములు(48) అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన చుక్కాపూర్ గ్రామానికి చెందిన కాలూరి వీరేశ్ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు మృతి చెందడంతో వెంకట్రావ్‌పేట, చుక్కాపూర్ గ్రామాల్లో విషాదచాయలు అలుముకున్నాయి.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- ఒక్క రోజులోనే ఛేదించిన పోలీసులు

కొత్తూర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వింటేజ్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఓ ఇంటిలో ఉంటున్న ఎండీ సంశూల్(31) అనే టైల్స్‌మేస్త్రీ హత్య కేసును స్థానిక పోలీసులు ఛేదించి, నిందితుడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ జి.నర్సయ్య కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన సంశూల్ గత కొంతకాలంగా కొత్తూర్‌కు వలస వచ్చి టైల్స్ మేస్త్రీగా పనిచేస్తూ వింటేజ్ కాలనీలోని నూతన నిర్మిస్తున్న ఓ ఇంటిలో మొదటి అంతస్తులో ఉంటున్నాడు. ఇదే ఇంటిలో కింది పోర్షన్‌లో ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన గంగాప్రసాద్ బాఘెల్(33) తాపీమేస్త్రీగా పనిచేస్తూ కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా అప్పుడప్పుడు సంశూల్, గంగాప్రసాద్‌లు గొడవకు దిగేవారు. సంశూల్ ఇటీవల గంగాప్రసాద్ వద్దకు వెళ్లి గొడవపడి ఆయన భార్య వైపు చూసి వెళ్లిపోయాడు. గమనించిన గంగాప్రసాద్ సంశూల్‌ను అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఈనెల 10న అర్ధరాత్రి మొదటి అంతస్తుకు వెళ్లి అక్కడ నిద్రిస్తున్న సంశూల్‌ను గమనించి బండరాయితో తలపై మోది హత్య చేసి పరారయ్యాడు. హత్య నేరం కింద ఇన్‌స్పెక్టర్ నర్సయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం కొత్తూర్‌లో తప్పించుకుని తిరుగుతున్న గంగాప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, సంశూల్‌ను తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈమేరకు గంగాప్రసాద్‌ను అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ నర్సయ్య పర్యవేక్షణలో ఎస్‌ఐలు గోపాలకృష్ణ, సత్యాశీలారెడ్డి, కానిస్టేబుళ్లు కుమార్, రవికుమార్, మహిపాల్, హరీష్‌కుమార్‌లు ప్రత్యేక టీంలుగా ఏర్పడి కేవలం ఒక రోజులోనే హత్య కేసును ఛేదించారు. ఈ సందర్భంగా పోలీసులను ఇన్‌స్పెక్టర్ నర్సయ్య ప్రత్యేకంగా అభినందించారు.

చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చివరి ధాన్యం గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, ఏఎంసీ చైర్‌పర్సన్ గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పనకే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ సత్యం, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సీఐ జానకిరామ్‌రెడ్డి, ఎస్‌ఐలు వెంకటేశ్, సీతారామ్ రెడ్డి, ఏవో శ్రీనివాస్‌గౌడ్, సీఈవో దేవేందర్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు, పీఏసీఎస్ డైరెక్టర్లు జోగు వీరయ్య, బెల్లి వెంకటయ్య, శ్రీపాల్, సేవ్యానాయక్, దోశ్యానాయక్, జంగమ్మ, ఏఎంసీ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, కండె రంగయ్య, సంపత్‌కుమార్, మిట్టపల్లి అంజయ్య, జంగయ్య, నాయకులు పాల్గొన్నారు.

అందెశ్రీకి ఘన నివాళి

ప్రముఖ రచయిత, గాయకుడు అందెశ్రీకి ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ఘన నివాళి అర్పించారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం అందెశ్రీ సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి హాజరయ్యారు. అందెశ్రీ మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ప్రజల గొంతుకగా నిలిచిన అందెశ్రీ మరణం తెలంగాణకు, సాహితీ లోకానికి తీరని లోటని ఎమ్మెల్యే కసిరెడ్డి అన్నారు. తహసీల్దార్ ఫయ్యామ్‌ఖాద్రి, ఎంపీడీవో మాధురి, కమీషనర్ శంకర్‌నాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు వరకు బస్సు నడపండి


వినతి పత్రం అందిస్తున్న ఆలూరు గ్రామస్థులు

చేవెళ్ల, నవంబరు 12(ఆంధ్ర జ్యోతి): ఆలూర్ వరకూ బస్సును నడపాలని, గ్రామానికి వస్తున్న ఆర్టీసీ బస్సును కిలో మీటర్ దూరంగా నిలిపి ప్రయాణికులను వదిలిపెడుతున్నారని.. విద్యార్థులు, వృద్దులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు బుధవారం చేవెళ్ల ఆర్టీసీ బస్ కంట్రోలర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వికారాబాద్ బస్ డిపో బస్సు ఆలూర్ గ్రామానికి వస్తుందన్నారు. అయితే, బస్సు గ్రామ పంచాయతీ వరకు రాకుండా గ్రామం వెలుపలనే రోడ్డుపై ప్రయాణికులను వదిలివేయడంతో విద్యార్థులు, వృద్దులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ఆర్టీసీ బస్సు గతంలో మాదిరిగానే గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చి తిరిగి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలూర్ మాజీ సర్పంచ్ అనంతరాములు గౌడ్, నాయకులు హైమద్, ఖదీర్, గ్రామస్తులు, విద్యార్థులు ఉన్నారు.

పాఠశాలల్లో ఇంకుడు గుంతలు తవ్వించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రాధారాణి

యాచారం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విధిగా ఇంకుడుగుంతలు తవ్వించాలని ఎంపీడీవో రాధారాణి, మండల ప్రత్యేకాధికారి మాధవరావులు వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇంకుడు గుంతల తవ్వకంతో భూగర్భజలం పెరుగుతుందని, మురుగు నీరు కూడా ఇంకుడుగుంతల్లోకి మళ్లించాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి, ఇతర పన్నులు వంద శాతం వసూలు చేయాలన్నారు. తాగు నీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. మురుగు నీరు నిల్వకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనులు చేపట్టాలన్నారు. విధిగా ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు శుభ్రం చేయించాలన్నారు. చెత్తాచెదారం లేకుండా వీధులను శుభ్రం చేయించాలన్నారు. ఎంఈవో పాండురంగారెడ్డి తదితరులున్నారు.

బీజేపీవి కుట్ర రాజకీయాలు


ఎమ్మెల్యే వంశీకృష్ణతో సురేశ్, జయప్రకాశ్, గోపాల్, నాయకులు

ఆమనగల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దేశంలో ఆధిపత్యం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర రాజకీయాలు సాగిస్తుందని ఏఐసీసీ తమిళనాడు రాష్ట్ర సంఘటన సృజన్ అభియాన్ పరిశీలకుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఓటు చోరీతో మోదీ ప్రభుత్వం అధికారంలో కొనసాగుతుందని ఆరోపించారు. తమిళనాడు రాష్ట్ర ఏఐసీసీ పరిశీలకుడిగా నియమితులై అచ్చంపేటకు వెళ్తున్న వంశీకృష్ణకు బుధవారం ఆమనగల్లు పట్టణంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు జూలూరి జయప్రకాశ్, గోపాల్, సురేశ్‌ల ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. పూలమాలలు, శాలువాలతో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ ఓటు చోరీకి అడ్డుకట్ట వేసి ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటంలో ప్రజలంతా కలిసిరావాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీ అనుబంధంగా పనిచేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమని, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పని చేస్తుందన్నారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. యాదయ్య, శేషయ్య, తదితరులు ఉన్నారు.

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శులుగా స్వప్న, ఎల్లేశ



ఇబ్రహీంపట్నం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ జిల్లా కమిటీలో ఇబ్రహీంపట్నంకు చెందిన పలువురికి చోటు దక్కింది. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శులుగా ఎలమోని స్వప్న, చింతపట్ల ఎల్లేశ్, జిల్లా కమిటీ సభ్యులుగా పి.జగన్‌లకు స్థానం కల్పించారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న వీరు మరింత బాధ్యతగా పనిచేస్తారనే నమ్మకంతో జిల్లా కమిటీలో అవకాశం కల్పించినట్లు సీఐటీయూ తెలిపింది.

(ఐదో పేజీ తరువాయి)

ప్రారంభించారు. ఇప్పటికే 30శాతం మేర కోతలు పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 34 చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినా.. చాలా చోట్ల ఇంకా అవి తెరుచుకోలేదు. వరి కోత మిషన్‌కు గంటకు రూ.2,500 తీసుకుంటున్నారు. అయితే, అదే పొలం తడిగా ఉండి దిగబడితే గంటకు రూ.3000 నుంచి రూ.3,200 వసూలు చేస్తున్నారు.

తక్కువ ధరకే మిల్లులకు ధాన్యం

వరి ధాన్యానికి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఏ గ్రేడ్ క్వింటాలకు రూ.2385 కాగా, సాధారణ రకానికి రూ.2365 ఉంది. అదీగాక సన్నాలకు తెలంగాణ ప్రభుత్వం అదనంగా క్వింటాలుకు

నేలవాలిన ఆశలు

రూ.500 బోనస్‌గా ఇస్తోంది. కాగా సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుచుకోకపోవడంతో యంత్రాలతో కోసిన ధాన్యాన్ని ఆరబెట్టకుండా ట్రాక్టర్లతో నేరుగా మిల్లులకు తరలిస్తున్నారు. మిల్లర్లు, దళారులు క్వింటాలు ధాన్యానికి రూ.1900 నుంచి రూ.2వేలు ఇస్తున్నారు. దొడ్డు రకమైతే మరో వంద రూపాయలు తక్కువే. కూలీల కొరత కారణంగా ధాన్యం కుప్పలుపోసి ఆరబెట్టి తిరిగి సంచుల్లోకి ఎత్తి కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లాలంటే రైతుకు తడిసి మోపెడవుతుంది. ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తూ బోనస్ కూడా వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పొలం తడారేలా లేదు..



కౌలుకు తీసుకుని రెండెకరాల్లో వరి సాగు చేశా. రూ.60 వేలు పెట్టుబడి పెట్టా. పది రోజుల కింద చేను కోయాలకున్నా. వరుసగా కురిసిన వానలకు పొలంలో నీరు పారుతుంది. కొంత చేను పడిపోయింది. చేనులోకి మిషన్ దిగేలా లేదు. రూ.500 ఇస్తామన్నా కూలీలొస్తలేరు. కనీసం గడ్డి కూడా చేతికొచ్చేలా లేదు.

- బంగ్ల శ్రీశైలం, రైతు
నందివనపర్తి, యాచారం మండలం


కార్తీక మాస వనమహోత్సవంలో మహిళలు

కార్తీక మాస ప్రత్యేక పూజలు

చౌదరిగూడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్తీక మాస వనమహోత్సవంలో భాగంగా మహిళలు ఉసిరిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం మండల పరిధిలోని రావిర్యాల మహిళలు కార్తీక మాసం పుష్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వనభోజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి షాద్‌నగర్‌లో కోటి దీపోత్సవం


కోటి దీపోత్సవం కరపత్రం విడుదల చేస్తున్న నిర్వాహకులు

షాద్‌నగర్ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఈనెల 14 నుంచి 16 వరకు షాద్‌నగర్‌లో కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సింగారం సరళ శ్రీనివాస్ తెలిపారు. ఛత్రపతి శివాజీ సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని హాజీపల్లి రోడ్డులోని ఆకుల మాణయ్య మైదానంలో దీపోత్సవం జరుగుతుందన్నారు. మొదటి రోజు వేదఘోష, గోపూజ, రుద్రాభిషేకం, బాల్యార్చన, కార్తీక దీపారాధన, మహా మంగళ హారతి, మంత్రపుష్పం, ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు ఉంటాయని తెలిపారు. 15న శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం, ఇతర కార్యక్రమాలు ఉంటాయి. 16న శివ పార్వతుల కల్యాణం, కార్తిక దీపారాధన, ఇతర పూజలు ఉంటాయని, భక్తులు పెద్దసంఖ్యలో హాజరై తరించాలని నిర్వాహకులు కోరారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం

కందుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నికైన బుడ్డీరపు శ్రీనివాస్ అన్నారు. ఇటీవల కాటేదాన్‌లో జరిగిన సీఐటీయూ జిల్లా మహాసభలో కందుకూరు మండల కన్వీనర్ శ్రీనివాస్‌ను జిల్లా కమిటీ సభ్యుడిగా ఎంపిక చేశారు. ఆయన మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో జిల్లా కమిటీలో అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. పని చేసే ప్రతీ కార్మికుడికి ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా కార్మికులకు న్యాయం జరగడం లేదన్నారు.

బీసీ ఆక్రోశ సభను విజయవంతం చేయాలి

కేశంపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న కామారెడ్డిలో నిర్వహించే బీసీ ఆక్రోశ సభను విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ మండలాధ్యక్షుడు మహిపాల్ మహారాజ్ పిలుపునిచ్చారు. బుధవారం కేశంపేట మండల కేంద్రంలో బీసీ ఆక్రోశ సభకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల కోసం బీసీ, ఎస్టీ ఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే సభను విజయవంతం చేయాలన్నారు. 15న పెద్ద ఎత్తున కామారెడ్డికి తరలివెళ్లాలని కోరారు. రాములు, రమేష్, శివ, రవి, మల్లేష్, కృష్ణ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.


కరపత్రం విడుదల చేస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు


నోట్‌బుక్స్ అందిస్తున్న సురేశ్, మిట్టపల్లి అంజయ్య

పేదల విద్యాభివృద్ధికి కృషి

తలకొండపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల నిర్వాహణలో ఆర్యవైశ్య మహాసభ ముందంజలో ఉంటుందని, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు గందె సురేశ్, ఉపాధ్యక్షుడు మిట్టపల్లి అంజయ్య, జిల్లా బుక్స్ కమిటీ చైర్మన్ ఎల్కుర్తి నారాయణలు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో నోట్ బుక్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సురేశ్ ముఖ్యఅతిథిగా హాజరై మహాసభ ప్రతినిధులతో కలిసి విద్యార్థులకు నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. మహాసభ ప్రతినిధులు మలిపెద్ది శ్రీనివాస్, రవీందర్, మురళీధర్, యశ్వంత్, కరుణాకర్, అరవింద్, కండె మధుసూధన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



చౌదరిగూడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎదిర ప్రాథమిక పాఠశాలలో పాలమూర్ ట్రస్టు అధినేత పాలమూర్ విష్ణువర్ధన్‌రెడ్డి సహకారంతో బీజేపీ జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు రాజు విద్యార్థులకు నోట్‌బుక్‌స పంపిణీ చేశారు. మురళి, తదితరులున్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం


కిట్లు పంపిణీ చేస్తున్న టీజీవోల సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా గెజిటెట్ అధికారుల సంఘం సామాజిక సేవా కార్యక్రమాల్లో తమ వంతుగా కృషి చేయడం అభినందనీయమని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు అన్నారు. జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం సభ్యురాలు, టీజీవోల కేంద్ర సంఘం మహిళా విభాగం కోశాధికారి జి.శాంతిశ్రీ ఆమె స్నేహితులు బుధవారం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో ప్రసవించిన నిరుపేద తల్లులకు వందకిట్లను పంపిణీ చేశారు. టీజీవోల సంఘం జిల్లా కె.రామారావు, శ్రీనేష్‌కుమార్ నోరి, వనస్థలి పురం ఏరియా సూపరిండెంట్ డా.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి

శంకర్‌పల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సీజేఐపై దాడికి నిరసనగా ఈనెల 17న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగల్ల ప్రవీణ్‌కుమార్ మాదిగ తెలిపారు. బుధవారం శంకర్‌పల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగానికి, చట్టాలకు లోబడే వ్యవహరించాలి తప్ప.. వాటని అతిక్రమించి సీజేఐపై దాడిచేసి దళితుల ఆత్మగౌరవాన్నే కాకుండా రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీశారని అన్నారు. మాజీ ఎంపీటీసీ ఎర్రోళ్ల రాంచందర్, కార్యదర్శి ప్రశాంత్, జన్వాడ, టంగటూర్ గ్రామాల అధ్యక్షులు సంపత్, ప్రభాకర్, నాయకులు శేఖర్ తదితరులు ఉన్నారు.

సంఘటితంతో రిజర్వేషన్లు సాధిద్దాం

షాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బీసీలందరం సంఘటితంతో రిజర్వేషన్లు సాధిద్దామని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు అన్నారు. షాబాద్‌లో నిర్వహిస్తున్న రిలే నిరహార దీక్ష బుధవారం 32వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి కల్పన, విద్య, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు రాజకీయాల్లో స్థానం కల్పించాలన్నారు. రిజర్వేషన్లు ఇచ్చే వరకూ పోరాటం చేస్తామన్నారు. సమితి నాయకులు రవీందర్, చేవెళ్ల స్వామి, రవీందర్‌గౌడ్, రమేష్, నర్సింహులు, జంగయ్య, గౌరీశ్వర్, రాము, చంద్రయ్య, మల్లయ్య, తదితరులున్నారు.

మాజీ సర్పంచ్ మృతి పట్ల నాయకుల సంతాపం


సోమయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు, లింగారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సోమయ్య మృతి పట్ల రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి సంతాపం తెలిపారు. బుధవారం లింగారెడ్డిపల్లిలో మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. జర్నలిస్టుగా, సర్పంచ్‌గా సోమయ్య అందించిన సేవలను గోలి కొనియాడారు. బాధిత కుటుంబానికి రూ.10 వేలు, ఎడ్మ సత్యం రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ ఎంపీపీ వెంకటయ్య గౌడ్, నాయకులు నాగులు నాయక్, వెంకట్‌రెడ్డి, నిరంజన్, సుభాష్, చంద్రశేఖర్ రెడ్డి, ఆనంద్, కొండల్ యాదవ్, ప్రభాకర్, యాదగిరి, శ్రీను, అశోక్, తదితరులు ఉన్నారు.

అవేర్ హాస్పిటల్‌కు అనుబంధంగా నర్సింగ్ కళాశాల

మహేశ్వరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అవేర్ మాధవన్‌జీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కి అనుబంధంగా మాధవన్‌జీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాలకు ప్రభుత్వ అనుమతి లభించిందని నర్సింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ పి.తరుణ్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన నర్సింగ్ కళాశాలలో ప్రతీయేటా 50 మంది విద్యార్థినీలు చేరేందుకు వీలుంటుందన్నారు. నాలుగు సంవత్సరాల కోర్సుకు మొత్తం 200 మంది విద్యార్థినీలు విద్యనభ్యసించే వీలుంటుందన్నారు. నర్సింగ్ విద్య పూర్తిచేసిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. నర్సింగ్ చేసినవారికి ప్రపంచంలో ఎక్కడైనా ఉద్యోగాలు లభిస్తాయని ఆయన తెలిపారు.

డ్రగ్స్‌రహిత సమాజ నిర్మాణానికి పాటుపడాలి


ర్యాలీలో లక్ష్మీనివాస్, సీఐ బద్యనాథ్ చౌహాన్, విద్యార్థులు

ఆమనగల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌రహిత సమాజ నిర్మాణానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్ పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలకు బానిసలవుతే కుటుంబాలు నాశనమవుతాయని, మానసికంగా, శారీరకంగా నష్టం జరుగుతుందన్నారు. ఆమనగల్లు పట్టణంలోని కల్యాణి గార్డెన్‌లో బుధవారం టీఎస్ఎస్‌వో ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక సదస్సు నిర్వహించారు. లక్ష్మీనివాస్, ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్, సీడీపీవో శాంతిరేఖ, సంఘ సేవకుడు పాపిశెట్టి రాములు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, టీఎస్ఎస్‌వో నాయకులు, ఎక్సైజ్ సిబ్బందితో కలిసి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్‌ను నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎక్సైజ్ ఎస్సైలు స్వప్న, అరుణ్‌కుమార్, టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధికార ప్రతినిధి రమేశ్ గౌడ్, చిక్కి, వస్పుల రవిశంకర్, మహేందర్ యాదవ్, శివ, వంశీ, దార్ల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.